## ఐదు రోజులుగా తాగునీరు బంద్



## కోడి పందేలు ఆడుతున్న పలువురి అరెస్ట్





AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com


## ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు సోమవారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ సీళ్లను, పోలీసు బందోబస్తును పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, సిబ్బంది సాత్విక్, విజయేందర్ రెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి శంకర్ తదితరులు ఉన్నారు.





## స్వాతంత్ర్య సమరయోధుల పోరాట స్ఫూర్తితో 'హర్ ఘర్ తిరంగా'

**అక్షరటుడే, ఇందూరు:** స్వాతంత్ర్య సమర యోధుల పోరాట స్ఫూర్తితో దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరు తమ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సూచించారు. సోమవారం నగరంలోని మిర్చి కంపౌండ్‌లో గల తన ఇంటిపై ఆయన జెండాను ఎగురవేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి సంవత్సరం మాదిరిగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం జరిగిందన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో స్వాతంత్ర్య పోరాట యోధుల త్యాగాల స్ఫూర్తిని నేటి తరానికి అందించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ అన్నారు.

### కామారెడ్డి ఎమ్మెల్యే..



**అక్షరటుడే, కామారెడ్డి:** స్వాతంత్ర్య పోరాట యోధుల త్యాగాలను స్మరించుకునేందుకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ఆయన క్యాంప్ కార్యాలయంపై జాతీయ జెండాను ఆవిష్కరించారు.

### ఇంటిపై ఎగిరిన జాతీయ జెండా..



**అక్షరటుడే, ఆర్మూర్:** భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు సోమవారం బీజేపీ జిల్లా నాయకుడు కలికోట గంగాధర్ తన ఇంటిపైన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అదేవిధంగా బీజేపీ, బీజేవైఎం నాయకులు వారివారి ఇళ్లపై జాతీయ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా కలిగోట గంగాధర్ మాట్లాడుతూ.. ఆగస్టు 15 వరకు ప్రజలంతా జాతీయజెండాలను తమ ఇళ్లపై ఎగురవేయాలని సూచించారు.

కామారెడ్డి పట్టణంలో రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలమయంగా మారిన రహదారులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షా నికి గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరైనా.. టెండర్ల ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

- అక్షరటుడే, కామారెడ్డి



# రోడ్లకు మోక్షమెప్పుడో?

- గుంతలమయంగా రహదారులు
- మరమ్మతులకు నిధులు మంజూరు
- ఖరారు కాని టెండర్లు
- అధికారుల నిర్లక్ష్యం.. ఇబ్బందుల్లో ప్రజలు

కామారెడ్డి మున్సిపాలిటీలో రహదారులు, పారిశుధ్య వ్యవస్థ అధ్వానంగా తయారవుతోంది. వాటిని పర్యవేక్షించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలం అవుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాల కారణంగా పట్టణంలోని అన్ని ప్రధాన రోడ్లు, కాలనీ రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు ప్రమాదాలకు గురవుతుండడంతో సమస్యను గుర్తించిన కలెక్టర్ దాదాపు మూడు నెలల క్రితమే రహదారులపై మొరం వేసి గుంతలు పూడ్చేందుకు రూ.40 లక్షలు మంజూరు చేశారని సమాచారం. నిధులు చేతికి వచ్చినా ఇప్పటివరకు టెండర్ ప్రక్రియనే మొదలుపెట్టకపోవడంతో పనులు కాగితాలకే పరిమితమయ్యాయి. దాంతో రహదారులపై గుంతలు అధికారుల అలసత్వాన్ని వెక్కిరిస్తున్నాయి.

### చెత్త వాహనాల కొనుగోలు

మున్సిపాలిటీలో పారిశుధ్య వ్యవస్థను మెరుగుపరిచేందుకు నాలుగు కొత్త చెత్త వాహనాల కొనుగోలుకు కౌన్సిల్ తన తొలి సమావేశంలోనే తీర్మానం చేసినట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న పాత వాహనాలు తరచూ పాడవుతుండడంతో కొత్తవి కొనాల్సిన అవసరం ఉందని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు.

అయితే ఈ టెండర్ ప్రక్రియ కూడా నేటికీ ముందుకు కదలలేదు. ప్రస్తుతం ఈ టెండర్ దక్కించుకోవడం కోసం ఇద్దరు దరఖాస్తు కూడా చేసినట్టుగా తెలుస్తోంది.


### ప్రజాప్రతినిధి ఒత్తిడే కారణమా

చెత్త వాహనాల టెండర్ కోసం ఇద్దరు మాత్రమే పోటీలో ఉన్నారు. వారిలో ఒకరు ఓ ప్రజాప్రతినిధికి సన్నిహితుడని, ఆయనకే టెండర్ ఇవ్వాలంటూ పై స్థాయిల నుంచి ఒత్తిడి వస్తున్నట్టు మున్సిపల్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ఇదే విషయమై కౌన్సిలర్ల మధ్య వివాదం కూడా జరిగినట్టుగా ప్రచారం సాగుతోంది. అందుకే అధికారులు ఫైల్‌ను కదపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### తీవ్ర ఇబ్బందుల్లో ప్రజలు


టెండర్ల జాప్యం కారణంగా ఒకవైపు రోడ్లు అధ్వానంగా మారి ప్రజలు ప్రమాదాలను ఎదుర్కొంటుంటే, మరోవైపు చెత్త సేకరణ ఆలస్యమై వీధులన్నీ చెత్తకుండీలుగా మారుతున్నాయి. దోమలు, ఈగల బెడద పెరిగి అంటురోగాల భయం కూడా నెలకొంది. వర్షాకాలం కావడంతో రోగాల బారిన పడతామని ప్రజలు భయపడుతున్నారు. వర్షం పడే సమయంలో రహదారిపై వెళ్లాలంటే గుంతలో ఎక్కడ దిగబడతామోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పెండింగ్ టెండర్లను పూర్తి చేసి పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.



## ఎస్సారెస్పీకి తగ్గుతున్న వరద.. 42 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ

**అక్షరటుడే,మెండోరా:** మండలంలోని శ్రీరాంసాగర్ (పోచంపాడ్) ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువన విష్ణుపురి, బాలేగావ్, బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరవడం, వర్షాల కారణంగా కూడా నీరు వచ్చి చేరుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 7,624 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1,091 అడుగులు, పూర్తి సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1,078.90 అడుగుల వద్ద 42.116 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 1,078.70 అడుగుల వద్ద 41.698 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ప్రస్తుతం గత ఏడాదితో పోలిస్తే సుమారు 0.4 టీఎంసీల మేర అధికంగా నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 462 క్యూసెక్కులు కలిపి మొత్తం 993 క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తోంది.

## రేపు యశోద మెడికల్ సెంటర్‌లో ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం




**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలోని యశోద మెడికల్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరం ఉంటుందని బ్రాంచ్ ఇన్‌ఛార్జి ఒక ప్రకటనలో తెలిపారు. మోకాళ్లు, తుంటి, మోచేయి నొప్పులు, కీళ్ల మార్పిడి, ఎముకలకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్‌కు చెందిన సీనియర్ కన్సల్టెంట్, రోబోటిక్, ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్‌మెంట్, ఆర్థోస్కోపీ సర్జన్ డాక్టర్ కీర్తి పాలడుగు, ఫుట్ అండ్ ఆంకిల్ సెంటర్ స్పెషలిస్ట్, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ డి.బి. ఆదిత్య సోమయాజి వైద్య సేవలు అందిస్తారన్నారు. అపాయింట్‌మెంట్ కొరకు 9154798768, 7075703538 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

## గౌడ సంఘం యువజన కమిటీ ఏర్పాటు



**అక్షరటుడే, మాక్లూర్:** గౌడ సంఘం మండల యువజన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. మండలంలో జరిగిన సమావేశంలో కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు జిల్లా సంఘం ప్రతినిధులు ప్రకటించారు. అధ్యక్షుడిగా సాయిగౌడ్, ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్, కోశాధికారి రమణతో కూడిన పదిమంది సభ్యులతో కూడిన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

## కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు దక్కుతుంది: షబ్బీర్ అలీ



**అక్షరటుడే,కామారెడ్డి:** కాంగ్రెస్ పార్టీ కోసం ఏళ్ల తరబడి కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు అవకాశాలు తప్పకుండా వస్తాయని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. భిక్కనూర్ మండలం తిప్పపూర్ పీఏసీఎస్ నూతన ఛైర్మన్, డైరెక్టర్ల అభినందన సభలో ఆయన మాట్లాడారు. కష్టకాలంలో పార్టీ జెండా మోసిన వారిని కాంగ్రెస్ ఎప్పటికీ విస్మరించదని, కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పిన షబ్బీర్ అలీ కాంగ్రెస్ అంటే రైతులు, రైతులు అంటే కాంగ్రెస్ అన్నారు. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. పీఏసీఎస్ లు రాజకీయ పదవులుగా కాకుండా రైతు సేవా వేదికలుగా ఉండాలని సూచించారు. నూతన ఛైర్మన్లు గూడెం శ్రీనివాస్ రెడ్డి, భీంరెడ్డి, డైరెక్టర్లు రైతులకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని, సమన్వయంతో సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు. సోమవారం ఆయన జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాత భవనాన్ని కూల్చి ఆధునిక వసతులతో నూతనంగా నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో పాఠశాలకు వచ్చిన షబ్బీర్ అలీ తాను చదువుకున్న తరగతి గదిలో కొద్దిసేపు కూర్చొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ పాఠశాల తనకు కేవలం విద్యాలయం కాదని, తన జీవితానికి పునాది వేసిన ప్రదేశమని, ఇక్కడి నుంచే తన ప్రయాణం మొదలైందని, అందుకే ఈ బడికి ఏదో ఒక మంచి చేయాలనే తపన ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం సీఎం దృష్టికి తీసుకెళ్లి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయించానని తెలిపారు. అత్యాధునిక ల్యాబొరేటరీలు, కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ తరగతి గదులు, ఆధునిక సౌకర్యాలతో పాఠశాలను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. అవసరమైన చోట తన సొంతంగా కూడా సహాయం చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులతో ఆత్మీయ సమావేశం నిర్వహించిన షబ్బీర్ అలీ తనతో కలిసి చదువుకున్న మిత్రులను పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఉమారాణి, గ్రంథాలయ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు కైలా శ్రీనివాస్ పాల్గొన్నారు.


## పేదల గొంతుక అన్నాభావు సాఠే..: ఎమ్మెల్యే ధన్‌పాల్



**అక్షరటుడే, ఇందూరు:** పేదల గొంతుకగా అన్నాభావు సాఠే నిలిచారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని చంద్రశేఖర్ నగర్ కాలనీ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాతంగ్ సమాజంలో పుట్టిన అన్నాభావు చిన్నప్పటినుంచి కుల వివక్షను ఎదుర్కొన్నారన్నారు. మిల్లులో పనిచేస్తూ వీధిదీపాల కింద కూర్చొని చదివి గొప్ప రచయిత కవిగా ఎదిగారని గుర్తు చేశారు. సుమారు 35 పుస్తకాలను రాసి ఆదర్శంగా నిలిచారన్నారు. కేవలం రచనలు చేయడమే కాకుండా మహారాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. జై భీమ్ జై భారత్ అనే నినాదంతో అంబేద్కర్ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లారన్నారు. ప్రధానంగా చదువు ఒక్కటే ఆయుధమని కులం పేరుతో ఎవరిని చిన్నచూపు చూడొద్దని పేర్కొన్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నాగోళ్ల లక్ష్మీనారాయణ, బెల్లాల్ శశాంక్, బంటు ప్రీతి ప్రవీణ్, అన్నా భావు సాఠే సమాజ్ కమిటీ అధ్యక్షుడు గంగాధర్ గైక్వాడ్ తదితరులు పాల్గొన్నారు.

## చినుకు తాకిడికి చిగురించిన ప్రకృతి

వాన చినుకులు తాకి పుడమి పరవంశించింది.. చెట్లన్నీ పచ్చటి రంగును అద్దుకున్నాయి. ఎండాకాలంలో ఎండకు ఆకులు రాలిపోయిన చెట్లు వర్షం కారణంగా కొత్తకళను సంతరించుకున్నాయి. పక్షుల కూతలతో అడవి మళ్లీ సజీవంగా మారింది. ఎల్లారెడ్డి కామారెడ్డి రోడ్డుకు ఇరువైపులా ఉన్న అడవులు పచ్చగా మారాయి. ఈ దారి గుండా వెళ్లే వాహనదారులు ఈ ప్రకృతి అందాలను తమ సెల్‌ఫోన్లలో బంధిస్తున్నారు.– అక్షరటుడే, సిద్దు



## ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా మల్లమరి సుధాకర్




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా మల్లమరి సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య ఆదేశాల మేరకు నగరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు (దళిత రత్న) కేదాసి మోహన్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మాదిగలకు దళిత బంధు ఇస్తామని చెప్పి ఏమార్చిందని విమర్శించారు. దీనిపై త్వరలోనే లక్షలాది మందితో భారీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా.. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎమ్మెల్యే, నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మాదిగ, మాలలకు అన్యాయం జరిగితే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు.

## ఎట్టకేలకు శ్మశాన వాటికకు విద్యుత్ కనెక్షన్



**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూర్ పట్టణంలోని శ్మశానవాటికలో గత కొన్నిరోజులుగా నెలకొన్న విద్యుత్ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో అంత్యక్రియల సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని స్థానికులు కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు మియాపురం శశికాంత్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన శశికాంత్, సమస్యను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంటనే విద్యుత్ శాఖ ఏఈతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన చొరవతో శ్మశాన వాటికకు విద్యుత్ కనెక్షన్ మంజూరై సోమవారం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను తమ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే స్పందించి పరిష్కారం కోసం కృషి చేసిన మియాపురం శశికాంత్‌కు, విద్యుత్ కనెక్షన్ ఏర్పాటుకు చొరవ చూపిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపసర్పంచ్ పరమేష్, ఈవో గంగారాం, మేకల విఠల్, శంకర్, కొరిమె రఘు, ప్రశాంత్, ఆనంద్ పాల్గొన్నారు.

## అదుపు తప్పి బోల్తాపడ్డ ఆటో.. మహిళ మృతి



**అక్షరటుడే, మెండోరా:** అదుపుతప్పిన ఆటో బోల్తా పడగా ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన ముప్కాల్ నుంచి మెండోరా వెళ్తుండగా చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో ముప్కాల్ నుంచి మెండోరా వైపు ప్యాసింజర్లతో వస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న కోడిచర్ల గ్రామానికి చెందిన వేల్పూర్ దేవాయ్ అనే మహిళ ఘటనాస్థలంలోనే మృతి చెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న మరికొందరికి గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆటోను ముప్కాల్ గ్రామానికి చెందిన సాయికుమార్ నడుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మెండోరా ఎస్సై సుహాసిని తెలిపారు.



నీటి సరఫరా నిలిచిపోవడంతో ఆ కాలనీవాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కి దూర ప్రాంతాలకు వెళ్ల నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. - అక్షరటుడే, బాన్సువాడ

# ఐదు రోజులుగా తాగునీళ్లు సరఫరా బంద్

**▪ఎల్లమ్మకాలనీ వాసుల తీవ్ర ఇబ్బందులు ▪ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్**

బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామం ఎల్లమ్మ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. గత ఐదు రోజులుగా కాలనీలో తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజువారీ అవసరాలకు అవసరమైన నీరు అందుబాటులో లేకపోవడంతో ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడుతున్నారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఇతర ప్రాంతాలకు పరుగులు

ఇళ్లలో నల్లానీరు రాకపోవడంతో కాలనీ ప్రజలు తాగునీటి కోసం బిందెలు, బకెట్లతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం, సాయంత్రం సమయాల్లో నీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లి గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని స్థానికులు తెలిపారు. తాగునీటి కోసం ప్రతిరోజూ ఇబ్బందులు పడుతున్నామని, అత్యవసర పరిస్థితుల్లో కూడా నీరు దొరకడం కష్టంగా మారిందని వారు పేర్కొన్నారు.

### పట్టించుకోని పంచాయతీ సిబ్బంది

ఐదు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయినప్పటికీ సంబంధిత పంచాయతీ సిబ్బంది సమస్యను పరిష్కరించడంలో తగిన చర్యలు తీసుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. సమస్యపై పలుమార్లు సమాచారం ఇచ్చినా స్పందన లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తమవుతోంది. తాగునీరు వంటి కనీస మౌలిక సదుపాయం విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదని వారు అంటున్నారు.

### ట్యాంకర్ల ద్వారా నీరందించాలని డిమాండ్

నల్లా నీటి సరఫరాలో సాంకేతిక సమస్య ఏదైనా ఉంటే దాన్ని వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. సమస్య పరిష్కారానికి సమయం పడితే కనీసం ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత గ్రామపంచాయతీపై ఉందని వారు పేర్కొన్నారు. ఎల్లమ్మ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఐదు రోజులుగా నిలిచిపోయిన నల్లా నీటి సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని, అప్పటి వరకు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించాలని కోరారు. లేకపోతే ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.



## ఆర్మూర్ ఆర్య, వైశ్య యువజన అధ్యక్షుడిగా శైలేష్

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ ఆర్య,వైశ్య సంఘం యూత్ ప్రెసిడెంట్‌గా ఉత్తర్వార్ శైలేష్ ఎన్నికయ్యారు. ఎన్నికల్లో భాగంగా యూత్ ప్రెసిడెంట్ పదవికి పోటీ నిర్వహించగా శైలేష్ భారీ మెజార్టీతో ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్‌గా ఎన్నికైన శైలేష్‌ను ఆర్మూర్ హౌసింగ్ బోర్డ్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దశరథ్, ఆర్మూర్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మ్యాక మోహన్ దాస్ , పిప్రికర్ పుష్పాకర్ రావు, కరుణాకర్ రెడ్డి, కిషన్, సురేందర్ గౌడ్, దశరథ్ గౌడ్, బీఎస్ఎన్ఎల్ రాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయంలో విగ్రహం ధ్వంసం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** అర్ధరాత్రి ఆలయంలోకి చొరబడ్డ దొంగలు శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘటన మోస్రా శివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వర్ని పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణుడి ఆలయంలో విగ్రహం ధ్వంసం అయిందనే సమాచారంతో పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. ఆలయంలో గుర్తు తెలియని దుండగులు విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లుగా గుర్తించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రైతులను బానిసలుగా మారుస్తున్న మోదీ ప్రభుత్వం




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నరేంద్ర మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం కార్మిక సంఘాల నాయకులు జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు రాజీవ్ గాంధీ ఆడిటోరియం నుండి ధర్నా చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి, రాస్తారోకో నిర్వహించారు. వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో పోలీసులు నాయకులను అరెస్టు చేసి ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.రమేష్ బాబు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వై.ఓమయ్య, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బి.భూమయ్య, ఏఐపీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.దేవారం, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.భూమయ్య, ఏఐఏడబ్ల్యూయూ రాష్ట్ర కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, జిల్లా అధ్యక్షులు వి.భూమయ్య మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం భారత రైతాంగాన్ని అమెరికాకు, కార్మిక వర్గాన్ని కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి




**అక్షర టుడే, ఆర్మూర్ :** మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ అన్నారు. మన కాలనీ మన భద్రత మన బాధ్యత ప్రోగ్రాంలో భాగంగా ఆర్మూర్ మహాత్మా జ్యోతిరావు పూలే ట్రైబల్ బీసీ వెల్ఫేర్ స్కూల్‌లో డ్రగ్స్ అవేర్నెస్, కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటించాలని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. సైబర్ నేరాలపై, షీటీం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షీటీం సభ్యులు విగ్నేష్, సుమతి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలపై పోలీసుల అవగాహన



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** పోలీసు శాఖ ఆధ్వర్యంలో డిచ్‌పల్లిలోని కేఎన్ఆర్ గార్డెన్స్‌లో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ రహదారి భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, ఇందల్‌వాయి మండలాల పరిధిలోని జాతీయ రహదారి పక్కన ఉన్న దాబాల నిర్వాహకులు, డిచ్‌పల్లి నుండి మాధవనగర్ వరకు ఉన్న వ్యాపార సముదాయాల యజమానులతో పోలీసులు సమావేశమయ్యారు. ఏసీపీ ప్రకాష్ యాదవ్, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ముఖ్య అతిథులుగా హాజరై వ్యాపారులకు పలు సూచనలు చేశారు. రోడ్డు సేఫ్టీ, పార్కింగ్, జాతీయ రహదారిపై వాహనాల అక్రమ పార్కింగ్‌తో ప్రమాదాలు జరుగుతున్నాయని, నిర్దేశిత స్థలాల్లోనే వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యాపార సంస్థలు, దాబాల వద్ద విధిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దాబాలలో నిబంధనలకు విరుద్ధంగా లిక్కర్ అమ్మకాలు జరపకూడదని, గంజాయి లాంటి మత్తు పదార్థాల వాడకంపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సదస్సులో ఐడీఏఆర్ మేనేజర్ వర్ష, డిచ్‌పల్లి సీఐ వినోద్, ఎస్సై ఎండీ ఆరిఫ్, జక్రాన్‌పల్లి ఎస్సై మహేష్, ఇందల్‌వాయి ఎస్సై సుమలత పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీ



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సేకరించినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. రెండేళ్ల క్రితం మూడు మొబైళ్లు, ఒక ఏడాదిలోపు రెండు మొబైళ్లను రికవరీ చేశారు. ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో బాధితులు గట్టు నర్సయ్య, మహమ్మద్ నవీద్, బొమ్మ సాయికుమార్, పుట్ట శోభ, సాయి తేజలకు ఎస్‌హెచ్‌వో సోమవారం ఫోన్లను అందజేశారు.

## కోడి పందేలు ఆడుతున్న పలువురి అరెస్ట్



**అక్షరటుడే, కామారెడ్డి:** కోడి పందేల సంస్కృతి కామారెడ్డి జిల్లాకు పాకింది. పలువురు రూ.వేలల్లో బెట్టింగ్‌లు పెడుతున్నారు. సదాశివనగర్ మండలంలో కోడిపందేల స్థావరంపై పోలీసులు మెరుపు దాడులు చేసి పలువురిని అరెస్ట్ చేశారు. సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లి గ్రామంలో భారీగా కోడిపందేలు జరుగుతున్నాయన్న పక్కా సమాచారంతో సదాశివనగర్ పోలీసులు కామారెడ్డి సీసీఎస్ పోలీసుల సహకారంతో దాడి చేశారు. 12 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అక్కడి నుంచి 9 బైక్‌లు, 3 కార్లు, 11 సెల్‌ఫోన్లు, 65 కత్తులు రూ.45,050 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో మండలంలో ఒక్కసారిగా కలకలం రేగింది. ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ కోడిపందేలు, జూదం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని, ఇకపై ఇలాంటి వాటిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అధ్వానంగా గాంధారి ఎక్స్ రోడ్ రహదారి

**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రభుత్వం మారింది... పాలకులు మారారు.. కానీ ఆ ప్రాంత రోడ్డు దశ దిశ మాత్రం మారడం లేదు. సదాశివనగర్ మండలం పద్మాజీవాడి చౌరస్తా(ఎక్స్ రోడ్) నుంచి గాంధారి వెళ్లే రహదారి పరిస్థితి ఇది. ఎక్స్ రోడ్ నుంచి గాంధారి వెళ్లే వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమై భారీగుంతలు ఏర్పడ్డాయి. రహదారి మొత్తం గుంతల మయంగా మారడంతో ఈ దారి గుండా వెళ్లే వాహనాలు సైతం పాడవుతున్నాయి. కొంతమంది బైకులపై వెళ్లే సమయంలో కిందపడి గాయాలపాలైన ఘటనలు సైతం ఉన్నాయి. అధికారులు, ఈ ప్రాంత ఎమ్మెల్యే ఈ రహదారిపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్డు మరమ్మతులు చేయించాలని, వీలైతే రోడ్డు డ్యామేజీ అయిన ప్రాంతంలో కొత్తగా రోడ్డు వేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



